ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్ వార్డు పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి టి.శంకరమ్మ, డి. బిక్షపతిలకు మంజూరు అయిన సీఎం సహాయ నిధి చెక్కులను గండిపేట మండల మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అనారోగ్యంతో ఆసుపత్రుల పాలైన వారికి సీఎం సహాయ నిధి పథకం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ టి. కృష్ణ, మాజీ సర్పంచ్ ఆర్. నర్సింహాలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణమోహన్‌రెడ్డి



మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కృష్ణమోహన్‌రెడ్డి

మణికొండ: మున్సిపల్‌శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కృష్ణమోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నార్సింగి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఇప్పటి వరకు పనిచేసిన టి.ప్రవీణ్ కుమార్‌రెడ్డిని కేంద్ర కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర మున్సిపల్ కమిషనర్‌ల సంఘం అధ్యక్షునిగా ఉన్న కృష్ణమోహన్‌రెడ్డి నార్సింగి మున్సిపాలిటీ ఏర్పడిన కొత్తలోను కమిషనర్‌గా పనిచేసిన తరువాత బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా వ్యవహరించారు. గత కొంత కాలంగా కేంద్ర కార్యాలయంలో పనిచేస్తున్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో పదవీబాధ్యతలు తీసుకున్న ఆయనను మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ విజయ్‌బాబు, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, కౌన్సిలర్‌లు లంకల పద్మవీరారెడ్డి, ఉషారాణి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'ఫ్రైడే-డ్రైడే'



దోమల నివారణ చర్యలను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించారు. 12వ డివిజన్‌లోని హిమాయత్‌సాగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమం చేయడంతోపాటు దోమల లార్వా పెరగకుండా నీటిని తొలగించారు. 10వ డివిజన్ సాయిబాబా కాలనీలోని రోడ్ల వెంట పెరిగిన గడ్డిని తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని, తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, జూనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, వర్క్ ఇన్‌స్పెక్టర్ వినయ్‌గౌడ్, బిల్ కలెక్టర్ మహిపాల్‌రెడ్డి, నవీన్, శానిటరీ జవాన్లు తౌఫిక్, స్వీపర్లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: కొడుకులపై మనస్థాపం చెంది ఓ వృద్ధురాలు ఇంటి నుంచి బయటికి వెళ్లిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబా నగర్ ప్రాంతానికి చెందిన బాలమణి (65) గత కొన్ని సంవత్సరాలుగా తన నలుగురు కొడుకుల దగ్గర ఉండేది. అదే క్రమంలో నలుగురు కొడుకులు తల్లిని చూసుకునే విషయం పైన ఇంట్లో గొడవలుపడ్డారు. దీంతో బాలమణి మనస్థాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినప్పటికీ కనబడక పోవడంతో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ

రాజేంద్రనగర్: తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు విలువైన డాక్యుమెంట్లు, నగదును ఎత్తుకెళ్లిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ నలందనగర్ కాలనీలో రాజేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. రాజేష్ బామ్మర్ది అనారోగ్యంతో మృతి చెందడంతో ఇంటికి తాళం వేసి వెళ్లాడు. అక్కడే అతడి భార్య అస్వస్థతకు గురి కావడంతో ఆసుపత్రికి తరలించాడు. అనంతరం రాజేష్ శుక్రవారం ఉదయం నలందనగర్‌లోని తన ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. అల్మారాలో భద్రపరిచిన 40 తులాల బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు, విలువైన డాక్యుమెంట్లు, రూ. 4 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జోరుగా స్వచ్ఛదనం-పచ్చదనం



మణికొండ శివాజీనగర్‌లో మొక్కలను పంపిణీ చేసిన చైర్మన్, కమిషనర్లు

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ఘనంగా సాగింది. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు విరివిగా మొక్కలు నాటారు. పెద్దషాపూర్‌తండా, కాచారం, సుల్తాన్‌పల్లి తదితర గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో రకరకాల మొక్కలను నాటారు.

ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలి

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం 14వ వార్డులో కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్ యాలాల లావణ్య నరేష్‌లతో కలిసి ప్రజలకు మొక్కల పంపిణీ, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు, 3వ వార్డులలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ జి.విజయ్‌బాబు, కౌన్సిలర్లు లంకల పద్మవీరారెడ్డిలతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీల పరిధిలోని రోడ్ల పక్కన పెద్ద ఎత్తున మొక్కలను నాటుతున్నామని, ప్రజలు సైతం తమ వంతుగా ఇళ్లలో మొక్కలను పెంచుకోవాలన్నారు. నార్సింగిలోని సాంఘీక సంక్షేమశాఖ గురుకుల బాలికల పాఠశాలల్లోను కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ జయతో కలిసి మొక్కలను నాటారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్‌లు రామకృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, మేనేజర్‌లు యోగేశ్, శ్రీధర్, నాయకులు నరేష్, ముత్యాలు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

శంషాబాద్ రూరల్: అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మల్కారం అటవీ ప్రాంతంలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ శశాంక హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ ప్రాంతంలో గత ఐదేళ్లుగా నాటుతున్న మొక్కల ఎదుగుదలను కలెక్టర్ కాలినడకన వెళ్లి పరిశీలించారు. 224 హెక్టార్ బ్లాక్‌లలో ఈసారి 20 హెక్టార్లలో 33,500 మొక్కలు నాటే లక్ష్యంగా ఉందన్నారు. వీటిలో ఇప్పటి వరకు 20 వేల మొక్కలు నాటినట్లు అటవీశాఖ అధికారులు వివరించారు. రోజు 5 వేల చొప్పున మొక్కలు నాటే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌తో కలిసి మొక్కలు నాటి నీళ్లు పోశారు. విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఓ సుధాకర్‌రెడ్డి, ఎఫ్‌డీఓ వియానందరావు, ఎఫ్ఆర్‌ఓ ఇర్షాద్, మండల పరిషత్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

బండ్లగూడ: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నూతన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు వనమహోత్సవాన్ని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్ ప్రశాంత్ నాయక్, డిఈఈ యాదయ్య, ఏఈఈ రాజ్‌కుమార్, బిల్ కలెక్టర్లు, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో వనమహోత్సవం

మణికొండ: మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల ఆవరణలో శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైస్ ప్రిన్సిపల్ కె. సుధాకర్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ ఆర్. ఆదిత్యరెడ్డిలు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన ఇంటి చుట్టుపక్కల వీలైనన్ని మొక్కలు నాటాలని, పర్యావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. తమ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వందలాది మొక్కలను నాటి కళాశాలను నందన వనంగా తీర్చిదిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి, డాక్టర్ వి.హరిలీల, డాక్టర్ సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో టీఎన్జీవోస్ కాలనీలోని జీహెచ్ఎంసీ పార్కులో శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, ఉపకమిషనర్ రవికుమార్‌తో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పాఠశాల విద్యార్థులతో మొక్కలను పంపిణీ చేసి నాటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడడం కోసం మొక్కలు పెంచాలని, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాముగౌడ్, మునగపాటి వెంకటేష్, బాస శ్రీనివాస్, ఏసు, యంజాల మహేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ శశాంక



ననాజీపూర్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం



వనమహోత్సవంలో మేయర్, కమిషనర్ తదితరులు

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ

మణికొండ: నార్సింగి ఉర్దూమీడియం పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ జి.వెంకటేష్ యాదవ్ బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు రావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారికి ఉచితంగా బస్‌పాస్‌లను అందిస్తుందన్నారు. విద్యార్థులను బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకుని క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల పంచమి పూజలు



నార్సింగిలో పూజలు చేస్తున్న కౌన్సిలర్, భక్తులు



పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

మణికొండ: నాగుల పంచమిని పురస్కరించుకుని శుక్రవారం పుట్టలు, నాగులమ్మల దేవాలయాలల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు సమీపంలోని పుట్టలు, దేవాలయాలకు చేరుకుని పుట్టలలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని పుట్టలు, దేవాలయాల వద్ద భక్తుల సందడి కనిపించింది. నార్సింగిలో కౌన్సిలర్ ఉషారాణి పూజలు నిర్వహించారు.

రాజేంద్రనగర్: నాగుల పంచమి సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు నాగేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుద్వేల్ కట్ట మైసమ్మ శివరాంపల్లి, రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ, భగవతిగూడ, న్యూ గ్రీన్ సిటీ కాలనీ, భవానీన కాలనీ తదితర ప్రాంతాల్లోని పుట్టల వద్ద భక్తజనం బారులు తీరారు. నాగపుట్టల్లో పాలు పోసి తమ మొక్కులను చెల్లించుకున్నారు.

ఆధునిక పద్ధతిలో కూరగాయలను సాగు చేయాలి



పంపిణీ చేసిన కిట్లతో రైతులు

ఏజీవర్సిటీ: ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఐసీఏఆర్‌లో ఎస్సీ సబ్‌ప్లాన్, వ్యవసాయ ఉన్నత విద్య బలోపేదం 2023-2024లో భాగంగా రైతులకు కూరగాయాల సాగు మెలకువలపై శుక్రవారం విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ ప్రశాంత్ ఒక రోజు శిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా పరిగి మండలం సైదుపల్లి, చిట్యాల, కేశంపేట్, సేదుపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ.. రైతులు ముఖ్యంగా నాణ్యమైన విత్తనాలను ఎన్నుకోవాలని, రైతులు ఆధునిక పద్ధతిలో కూరగాయల సాగు చేస్తే నాణ్యతతో పాటు అధిక దిగుబడిని పొందవచ్చని వివరించారు. రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న వ్యవసాయ అభివృద్ధి పథకాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం రైతులకు సాగు అవసరమయ్యే నాణ్యమైన కూరగాయల విత్తనాల కిట్లు, మల్చింగ్ షీటు, జీవన ఎరువులు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రీతం గౌడ్, మమత, లావణ్య, మజ్జిగ శ్రీనివాస్, తిరుపతయ్య, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని అంబాయమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయాన్ని ప్రారంభించి సంవత్సరం పూర్తైయిన సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అభిషేకంతో ప్రారంభమైన పూజ కార్యక్రమాలు మధ్యాహ్నం అన్నదానం, రాత్రి పల్లకి సేవ, మహారథి తదితర పూజ కార్యక్రమాలు జరిగాయి. పూజ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్, బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మొదటి వార్షికోత్సవ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆలయం ఆవరణలో నిర్వహించిన హోమంలో పిట్టల శివ ముదిరాజ్, పిట్టల లక్ష్మణ్, వాసుగౌడ్, అర్జున్, రవి కుమార్, కిరణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీతో రైల్వే ఇనిస్టిట్యూట్ ఒప్పందం

మణికొండ: గండిపేటలో మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలతో ఇండియన్ రైల్వేస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్, టెలికమ్యూనికేషన్స్ (ఐఆర్ఐఎస్ఈటీ) ఒప్పందం చేసుకుంది. శుక్రవారం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఆర్ఐఎస్ఈటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌పీ సింగ్, కళాశాల సీఈసీ హెచ్ఓడీ డాక్టర్ పి. నాగశంకర్‌రెడ్డిలు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థపై అధికారులకు శిక్షణ, స్కిల్ ఓరియాంటెడ్‌గా అధ్యాపకులకు డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇండిజీనియస్ ఆటోమెటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఐఏటీపీ) సిస్టమ్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. చంద్రమోహన్‌రెడ్డి, రైల్వేశాఖ అధికారులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకున్న సంస్థల ప్రతినిధులు

ఉచిత శిబిరం

రాజేంద్రనగర్: జర్మన్‌టెన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో హైదర్‌గూడలోని రామ మందిరం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో స్థానికులను డాక్టర్లు పరిశీలించి వైద్య సేవలు అందించడంతో పాటు ఉచితంగా మందులను అందజేశారు. వైద్య శిబిరాన్ని ఆసుపత్రి మేనేజర్ రాహుల్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు జర్మన్‌టెన్ ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ జావీద్ ఖాన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిపుణులైన డాక్టర్ల బృందం ఈ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలను వినియోగించుకోవాలని కోరారు.



రోగులకు వైద్య సేవలను అందిస్తున్న వైద్యులు